# అబల

ముక్కు మొహం తెలీని ఓ ఆడపిల్లని తీసుకొచ్చి ఎదురుగా కూర్చోబెట్టి 'ఈ అమ్మాయిని అర్జంటుగా చూసి నీ జీవిత భాగస్వామినిగా తగునో, కాదో చెప్పు' అందే చాలా కష్టం.

ఈ విషయం పెళ్ళి చూపులకి వెళ్ళినప్పుడుకానీ నాకు తెలీలేదు.

అమ్మ, నాన్నగారు, అక్కయ్య, బావతోపాటు వెళ్ళాను - అమ్మాయిని చూడడానికి!

మాకు మర్యాదలు చేయడానికి ఆ ఇంటిల్లపాదీ పడుతున్న అవస్థలు చూస్తుంటే జాలేస్తోంది. కానీ మావాళ్ళు 'ఇది మా హక్కు' అన్నట్లు ఠీవిగా కూర్చుని, టిఫిన్ తింటూ అమ్మాయి గురించి అన్ని వివరాల్నీ సేకరిస్తున్నారు.

టిఫిన్లయ్యాయి.

''పార్వతీ! అమ్మాయిని తీసుకురా....'' లోపలికి చూస్తూ కేకేశాడు పిల్లతండ్రి పరంధామయ్యగారు.

నాలో టెన్షన్ క్షణ క్షణానికి పెరిగిపోతోంది. ఆ అమ్మాయి ఎలా వుంటుందో? ఒకవేళ నచ్చలేదంటే ఆ అమ్మాయి ఎన్ని తిట్టుకుంటుందో?

అటు ఇటు తల్లి, అక్క వెంటరాగా హాల్లోకి అడుగు పెట్టింది పెళ్ళికూతురు.

ఒక్కసారి వులిక్కిపడ్డాను.

కరుణ!

'ఆ అమ్మాయి వాళ్ళతండ్రి తొందరపడుతున్నాడు .... ఒకసారి వచ్చి పిల్లను చూసి వెళ్ళు....పిల్ల నీకు నచ్చితేనే మిగతా విషయాల గురించి మాట్లాడతాను' అంటూ నాన్నగారు పదేపదే వుత్తరాలు రాయడంతో శలవు పెట్టివచ్చాను. పిల్లపేరు 'కరుణారుణ' అంటే ఒక్కక్షణం కరుణ గుర్తుకొచ్చింది గానీ ఇలా ఆమే తటస్థిస్తుందని అనుకోలేదు. ఆనందంతో కూడిన దడ ప్రారంభమైంది.

కరుణ ఎదురుగా వేసిన చాపమీద కూర్చుంది - తలవంచుకుని.

ఆమెనలా చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా వుంది. కాలేజీరోజుల్లో ఎవరిముందూ తల వంచడం అనేది ఎరుగని కరుణేనా నా ముందు తల వంచుకుని కూర్చున్నది!

పెళ్ళిచూపులకి వస్తోంది నేనని ఆమెకు తెల్సా?

"నీ పేరేమిటమ్మా?" నాన్నగారు అడిగారు.

"కరుణ...." నెమ్మదిగా తలెత్తింది.

నన్ను చూసింది.

ఆమె కళ్ళల్లోనూ ఆశ్చర్యం!

అంతే! వంచిన తలను మళ్ళీ ఎత్తలేదు. అమ్మ, అక్కయ్య అడిగిన ప్రశ్నలకు తలెత్తకుండానే జవాబిచ్చింది.

"ఇక అమ్మాయిని తీసుకెళ్ళండి లోపలికి...." నాన్నగారు అన్నారు.

ఆమాట అన్నదే ఆలస్యం లేచి లోపలికి వెళ్ళిపోయింది కరుణ.

పెద్దవాళ్ళందరూ ఏమేమో మాట్లాడుకుంటున్నారు. నా ఆలోచనలు మాత్రం గతంలోకి పరుగెత్తాయి.

ఫైనలియర్ కల్చరల్ వీక్స్‌లో వెయ్యడానికి ఆడవాళ్ళందరూ కలసి ఓ నాటికకి తయారవసాగారు.

సాయంత్రం పూట ఆడిటోరియంలో రిహార్సల్స్ జరుగుతుండేవి.

రవిశంకర్, శివకుమార్, బాలకృష్ణ, భాస్కర్, రామచంద్రరావు- మా బాచ్ అందరం ప్రాంప్ట్‌గా అయిదయ్యేసరికల్లా అక్కడికి చేరుకునే వాళ్ళం. అప్పుడప్పుడూ రిహార్సల్ వెయ్యడానికి వచ్చేవాళ్ళయినా మానే వాళ్లు గాని మాలో ఒక్కడూ ఒక్కరోజూ మానేవాడు కాడు.

దూరంగా కూర్చుని వాళ్ళ రిహార్సల్స్ గమనిస్తూండేవాళ్ళం.... వాళ్ళకి వినిపించకుండా రకరకాల కామెంట్లు చేస్తూండేవాళ్ళం.

ఒకరోజు రవిశంకర్‌కి వింత ఆలోచన వచ్చింది.

"వాళ్ళందరిలోకి నాకు జయలక్ష్మి బాగుంది. మీ ఎవరెవరికి ఎవ రెవరు నచ్చారో ఎన్నుకోండి. నాటిక అయిపోగానే ఎవరి అభిమానానికి వాళ్ళు ప్రత్యేక బహుమతిని చదివిద్దాం ఓకే-...." అన్నాడు.

అందరూ తలా ఓ పిల్లని ఎన్నుకున్నారు.

ఎవ్వరూ ఓ పిల్లని పట్టించుకోలేదు.

బహుశా చామన ఛాయలో వుండడమే అందుక్కారణమేమో!

నాకు జాలేసిందామె మీద.

అందుకే చటుక్కున అనేశాను- "అందరిలోకి ఛాయ తక్కువైనా చూడడానికి కరుణ బాగుంటుంది. పైగా బాగా నటిస్తోంది కూడా!"

ఆ రోజునుంచీ ఆమె అంటే విపరీతమైన అభిమానం...రోజు రోజుకి అది పెరసాగింది.

నాటిక అయిపోగానే ముందుగా అనుకున్నట్లు ఎవరికి నచ్చిన పిల్లకి వాళ్ళం 'బాగా నటించినందుకు' అంటూ ప్రత్యేక బహుమతుల్ని స్టేజిమీద ఇప్పించాం.

ఆ మర్నాటి నుంచి దిగులు....

సాయంత్రమయేసరికి కాళ్ళు ఆడిటోరియమ్ వేపు దారితీసేవి.

ఖాళీ ఆడిటోరియమ్‌ను చూడగానే మనసు బావురుమనేది. నా మనసులోని బాధ ఎవరికి చెప్పుకోవాలి?

కరుణని చూడకుండా ఒక్కరోజు కూడా వుండలేననిపించింది.

అందుకే ఆ రోజు కాలేజి కాంపస్‌లో ఒంటరిగా కనిపించిన ఆమె వెంటపడ్డాను.

"ఎందుకు నా వెనుక అలా వస్తారు?...." నా అవస్థని గమనించి చిరాకుగా అంది కరుణ.

అసలే నెర్వస్‌గా వున్న నాకు ఆ దెబ్బతో నోటిమాట కూడా రాలేదు.

"మీకే చెప్పేది! నా వెనక పడ్డారంటే మర్యాదగా వుండదు." మరోసారి గర్జించింది.

"మరి....మరి....నేను...." గొంతులో ఏదో అడ్డం వడ్డట్లు లోపలి భావాలు లోపలే కూరుకుపోతున్నాయ్.

"ఏమైంది మీకు?"

"మిమ్మల్ని ప్రేమించాను...." కళ్ళు మూసుకుని చటుక్కున అనేశాను.

ఛెళ్ళుమంది చెంప!

కళ్ళు తెరిచిన తర్వాత కూడా సరిగా కనపడలేదు. తెలీకుండానే కళ్ళవెంట నీళ్ళొచ్చేశాయి. ఆ కన్నీళ్ళు కళ్ళని మరింతగా కప్పేశాయి.

మరుక్షణంలో ఏదో గుర్తుకొచ్చి చుట్టూ చూశాను.

ఎవ్వరూ లేరు!

అప్పటికే క్లాసులు మొదలై పోవడంతో అందరూ క్లాసుల్లో వున్నారు. మేమిద్దరమే ఆలస్యంగా వస్తున్నారు.

'ప్రేమించాను' అన్న మాత్రాన ఆవిడకంత కోపం ఎందుకొచ్చిందో నాకు అర్థం కాలేదు. నేనేమీ చెయ్యివట్టుకోలేదుగా చెంపలు పగులగొట్ట డానికి?

అంతవరకూ ఆమె మీదున్న ప్రేమకాస్తా కోపంగా మారిపోయింది. ఆ తర్వాత ఎప్పుడూ ఆమెని కన్నెత్తికూడా చూడలేదు.

ఇవాళ తిరిగి ఇలా కనిపించింది!

''వెళ్దాం పదరా!....'' నాన్నగారి మాటలతో ఆలోచనల్లోంచి బయటపడ్డాను.

ఆ ముసలాయన తన కూతురు గురించి తెగ చెబుతున్నాడు.

''ఓ వారం రోజుల్లో ఏ విషయం తెలియజేస్తాం.'' మా ఆటో బయల్దేరబోయే ముందు అన్నారు నాన్నగారు.

ఆ మర్నాడే బయల్దేరి వచ్చేశాను నేను.

''నీ అభిప్రాయం ఏమిట్రా?'' అంటూ అడిగారు నాన్నగారు వచ్చే నేప్పుడు.

''ఆలోచించుకుని రాస్తాను'' అని చెప్పాను

చెంప పగలగొట్టిన పిల్లని భార్యగా స్వీకరించాలా- వద్దా? అన్న సందిగ్ధంలో మరో నాల్గు రోజులు గడిచిపోయాయి.

ముక్కూ- మొహం తెలీనివాణ్ణే చెంప పగలగొట్టిన ఈమె రేపు నా మాట వింటుందా? అదే నా భయం.

నా అనుమానాల్ని పటాపంచలుచేస్తూ ఆ రోజు ఉత్తరం వచ్చింది.

కరుణ ఉత్తరం రాసింది! ఎందుకో నా గుండెలు దడదడ లాడాయి.

పెళ్ళి చూపులంటూ అంగట్లో బొమ్మలను చూసినట్లు ఆడపిల్లల్ని చూస్తూ - కనీసం అభిప్రాయాన్ని వెంటనే తెలియజెయ్యాలనే జ్ఞానంలేని నువ్వేమి మినిషివంటూ చెడా మడా దులిపేస్తూ రాసిందేమో వుత్తరం!

భయపడుతూనే కవర్ను చింపి, చదవసాగాను.

''రాధాకృష్ణగారికి—

మీరు వారంరోజులైనా ఉత్తరం రాయకపోయేసరికి మీ అభిప్రాయం అర్థమైంది. కానీ నాదో చిన్న రిక్వెస్ట్.

ఆ రోజు నా వెంటపడి 'ప్రేమించాను' అంటూ వెర్రి మాటల్ని చెప్పిన ఎంతోమంది చెంపల్ని పగలకొట్టాను. పొగరుమోతుతనంతో కాదు- కేవలం నా భద్రత కోసం. ఇవాళ పెళ్ళిచూపుల కొచ్చిన వాళ్ళందరి ముందూ తలవంచుకుని కూర్చుంటున్నాను - భార్యగా నా స్థానం ఎవరి దగ్గర దొరుకుతుందోనని.

కానీ మగవాళ్ళలో అప్పుడు లేని ధైర్యం, అహంభావం ఇప్పుడు వస్తుందని తెల్సు.

ఆ ధైర్యంతోనే మీరు నామీద ప్రతీకారం తీర్చుకోడానికి నేను నచ్చలేదని అంటారనీ నాకు తెల్సు.

అయినా ఈ ఉత్తరం ఎందుకు రాస్తున్నానంటే దయచేసి నామీద 'అహంభావి, పొగరుమోతు' అనే ముద్రలువేసి మాత్రం నిరాకరించకండి. కట్నం కాంపిటిషన్‌కే తట్టుకోలేకపోతున్న నాన్నగారు ఈ బిరుదులు కూడా వచ్చాయంటే నా పెళ్ళి అసలు చెయ్యలేనని బెంబేలుపడిపోతారు.

మరొక్క మాట.... చెంపదెబ్బ కొట్టానని ఉక్రోషంతో విజృంభించక నాతోనేకాక మరే ఆడపిల్లతోనూ ఇలా మాట్లాడడానికి సాహసించని మీ మార్పుకోసం అలా చేశానని అర్థం చేసుకుంటారని ఆశిస్తూ-

మిమ్మల్ని భర్తగా పొందే స్త్రీని అభినందిస్తూ—

ఓ అబల

"కరుణ"

తల తిరిగిపోయింది ఆ ఉత్తరాన్ని చూడగానే! నేనూహించినట్లు ఉత్తరం వున్నా నా కింత బాధ అనిపించేది కాదేమో!

ఎంతటి కాయా కత్తిపీటకు లోకువే అన్నట్లు ప్రతీ ఆడపిల్లా ఇలా 'అబల'గా మారిపోవలసిందేనా?

నన్ను చెంపదెబ్బ కొట్టడంలో ఆమె తప్పేమిటి? ముక్కు మొహం తెలీనివాడు వెనుకబడి 'ప్రేమ-పెళ్ళి' అంటే ఏ ఆడపిల్ల వూరుకుంటుంది?

నో.... కరుణ అలా బేలగా మారడానికి వీల్లేదు. ఆమె ఇదివర కటిలా ధైర్యంగా, సబలగానే వుండాలి.

వెంటనే ఉత్తరం రాసి పడేశాను.

ఆ రోజుల్లో కేవలం కుర్రతనం కాబట్టి మాట అని వూరుకున్నానని, అప్పుడు గుండెల్లో పెట్టుకుని పూజించడానికి సిద్ధంగా వున్నానని, నీలాంటి భార్యకోసమే వేచి వున్నానని, త్వరలోనే పిల్ల నచ్చింది- లగ్నాలు పెట్టు కుందామని మా నాన్నగారి దగ్గరినుంచీ వుత్తరం వస్తుందని.

ఆ రోజే నాన్నగారికి రాశాను—

పిల్ల నచ్చింది — మిగతా విషయాలు మాట్లాడుకొమ్మని! *

(స్వాతి సపరివారపత్రిక, 14-3-86)